క్లుప్తంగా

ఘనంగా పందిరిరాట మహోత్సవం



పందిరి రాటకు పూజలు చేస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మెండేటివీధిలో ఉన్న లక్ష్మీగణపతి స్వామివారి ఆలయం వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాల కోసం ఆదివారం పందిరి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి పందిళ్ల వేసేందుకు ప్రథమ పూజలను చేశారు. కార్యక్రమంలో షిర్డీసాయి సేవా సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బొంతలకోడూరులో గ్రామ సభ రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరులో జగనన్న శాశ్వత భూ హక్కు రీసర్వే ఆమోదం కోసం మంగళవారం గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వై.సత్యనారాయణ తెలిపారు. రైతులకు ఎటువంటి అభ్యంతరాలున్నా రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. రీసర్వే పక్కాగా నిర్వహించినట్లు వివరించారు.

చిన్నారులకు నీతికథల పోటీలు



బహుమతులతో చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు నీతి కథల పోటీలు జరిగాయి. ఉత్సాహంగా పిల్లలు పోటీల్లో పాల్గొన్నారు. చక్కగా కథలు చెప్పిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బి.ఎం.ఎస్.పట్నాయక్, నటుకుల మోహన్, ప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో భైరవస్వామి



పూజలందుకున్న భైరవస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ స్వామి దేవాలయంలో స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పీఠం నిర్వాకులు గణేష గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానం



పొన్నాడ వద్ద పూడిక తీస్తున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎండల తీవ్రత ఎక్కువ కావటంతో నారాయణపురం కుడి కాలువలో నీటి ప్రవాహం తగ్గింది. శివారు ప్రాంత రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. పొన్నాడ, ధర్మవరం, కొంగరాం ప్రాంతంలో రైతులు శ్రమదానం చేసి పూడికలు తొలగించారు.

సమస్యలు పరిష్కరించాలి

లావేరు: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ అన్నారు. మండల కేంద్రం లావేరులో ఆదివారం మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఉద్యోగ భద్రత అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం అక్టోబర్‌లో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర, మండల నాయకులు పాల్గొన్నారు.

ఆటపాటలతో మానసిక ఉల్లాసం

- గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన
- విద్యార్థులకు బహుమతుల ప్రదానం



రణస్థలం: కథలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి తెలిపారు. మండలంలోని రణస్థలం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలు పెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయన్నారు. కథలు, తెలుగు పద్యాలు పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపాటి శివ ప్రసాద్, టి.సత్యం, పాఠకులు ఉన్నారు.

ఎచ్చెర్ల, ధర్మవరం గ్రంథాలయాల్లో..

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల, ధర్మవరం గ్రంథాలయాల్లో ఆదివారం పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు నీలమ్మ, మలిపెద్ది చంద్రశేఖర్‌రావు గ్రంథాలయాల్లోని ఉన్న పుస్తకాలు గురించి విద్యార్థులు, పాఠకులకు వివరించారు. ప్రతీనెల మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖుల ఆత్మ కథలు, నీతికథలు, సాహిత్య పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పుస్తక పఠనం..

లావేరు: పుస్తక పఠనంతో మేధా సంపత్తి పెరుగుతుందని మురపాక శాఖాగ్రంథాలయాధికారి టి.రాంబాబు అన్నారు. మండలంలోని మురపాక గ్రామంలో గల శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. రామాయణం, మహాభారతం, బైబిల్, ఖురాన్‌తోపాటు పలు రకాల పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులతోపాటు పలువురు వచ్చి ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలను చదవడం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం..

లావేరు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లావేరు శాఖాగ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రం లావేరులోని శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. పలు రకాల పుస్తకాలు చదవడంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ గ్రంథాలయాలల్లో విద్యార్థులకు ఉపయోగపడే ఎన్నో రకాల పుస్తకాలు ఉంటాయని, విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి వాటిని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న పాఠకులు



ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



లావేరు: మురపాక గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శన కార్యక్రమం



లావేరు: లావేరు గ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమం

ప్రైవేటు టీచర్లకు న్యాయం చేయాలి



నిరసన చేపడుతున్న ప్రైవేటు టీచర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఆదివారం సాయంత్రం శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ జంక్షన్ సమీపంలో పోస్టర్లతో నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న టీచర్లకు మినిమం టైం స్కేల్ ఇప్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వెంటనే డీఎస్సీని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వి.సత్యన్నారాయణ, జి.రవీంద్రకుమార్, బి.వెంకటరావు, శ్రీనివాసరావు, రాజ్ కుమార్, లక్ష్మణ్, లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న పీఆర్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీ సచివాలయం కార్యదర్శులకు ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఆరు రోజుల శిక్షణ ఆదివారంతో ముగిసింది. పంచాయతీరాజ్ చట్టాలు, లేఅవుట్ల నిర్వహణపై క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. యోగా, ధ్యానం, ఆరోగ్యం వంటి అంశాలపై సైతం శిక్షణ ఇచ్చారు. పంచాయతీరాజ్ ఈటీసీ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ మాట్లాడుతూ శిక్షణలో పంచాయతీరాజ్ చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించామన్నారు. గ్రామ కార్యదర్శులకు ఈ శిక్షణ పూర్తిస్థాయిలో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణకు హాజరైన సచివాలయం కార్యదర్శులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

జెమ్స్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం



హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద జెమ్స్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సేవలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. సీనియర్ స్పెషాల్టీ వైద్యుడు గూడేన సోమేశ్వరరావు, సుధీర్, ఆర్ఓం బాలమురళీ, ప్రవీణ్‌లు సేవలను ప్రారంభించారు. అన్నిరకాల వైద్య సేవలతో పాటు ఆరోగ్యశ్రీ కేసులను కుడా పరిగణలోకి తీసుకుంటామన్నారు.

జాతీయ సెమినార్ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు

రణస్థలం: అక్టోబర్ 15, 16వ తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించనున్న జాతీయ సెమినార్ జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు కోరారు. మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణంలో ఆదివారం సీఐటీయూ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జాతీయ నాయకులు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలు సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సెమినార్‌కు జాతీయ అధ్యక్షురాలు కె.హేమలత, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వి.నాగేశ్వరరావు, సీహెచ్ నర్సింగరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు హాజరవుతారన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను సెమినార్లో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పలు యూనియన్ నాయకులు బి.అప్పమ్మ, కాంతమ్మ, వి.లక్ష్మి, వై.బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కషాయాల తయారీపై శిక్షణ



కషాయాల తయారీపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని సంతసీతారంపురం సైౖ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ సాగుపై మూడు రోజుల శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ప్రకృతి వ్యవసాయంలో పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా కషాయాలు, రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. ఏపీ వ్యవసాయ అధ్యాపకుల సమన్వయకర్త డి.రవికుమార్ ఆధ్వర్యంలో బృందం శిక్షణ ఇచ్చింది. అన్ని పంటలను ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులతో రైతులకు ఆర్థికభారం తగ్గటంతోపాటు పంట దిగుబడులు పెరుగుతాయన్నారు. గ్రామం యూనిట్‌గా ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ కె.మోష పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ నాయకులకు సన్మానం



సంఘ నాయకులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

గార: ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘ నాయకులు (1998) మల్లేశ్వరరావు, రాజగోపాలనాయుడులను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. శ్రీకూర్మం స్కూల్ కాంప్లెక్సు పరిధిలో 1998 ఉపాధ్యాయ సంఘ సభ్యుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆశీస్సులతో మేమంతా ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నామన్నారు. అందుకోసం కృషి చేసిన సంఘ నాయకులను సన్మానించడం జరిగిందన్నారు. మేలు చేసిన వారిని మరిచిపోమని ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులన్నారు. కార్యక్రమంలో ఎంపీ పాపాచారి, నరసింహామూర్తి, రామారావు, మాణిక్యాలరాజు తదితరులున్నారు.

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం



కవులను సత్కరిస్తున్న తెరవే సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం 84వ నెలవారీ సాహితీ సమ్మేళనం జరిగింది. సంస్థ అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్.వి.రమణ మూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ప్రధాన అంశంగా 12 మంది కవులు తమ కవితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా తెరవే గౌరవ సభ్యులు పి.వి.దుర్గాప్రసాద్, ప్రముఖ కవి రచయిత జంధ్యాల శరత్‌బాబులను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిక్కు హరిసత్యన్నారాయణ, తంగి యర్రమ్మ, బి.జగన్నాథరావు, ఐఎన్‌డీ ప్రసాద్, తోట గోపాలరావు, చాడ శ్రీనివాసరావు, ఎస్.ఈశ్వరరావు, పూడి జనార్దన రావు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో 'చిన్నారికి చేదోడు'



బీసీ వసతిగృహంలో మాట్లాడుతున్న ఎస్సై గణేష్

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు వసతి గృహాల్లో 'చిన్నారికి చేదోడు' కార్యక్రమాన్ని ఎస్సై బలివాడ గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్, రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని పిల్లలకు పలు అంశాలపై కౌన్సెలింగ్ చేశారు. ఎస్సై గణేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డు ప్రధానోపాధ్యాయులు బలరామకృష్ణ (బీసీ వసతిగృహం), పార్వతీశం (ఎస్సీ వసతిగృహం), రిటైర్డు డీటీ జగదీశ్వరరావు (ఎస్టీ వసతిగృహం), వార్డెన్లు పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం సమీపంలోని తోటల్లో నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ ఆధ్వర్యంలోని పోలీసులు దాడి చేశారు. రూ.30,310 నగదు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. జూదం, బెట్టింగ్‌లు వంటి సంఘ విద్రోహ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్ఐ చెప్పారు.

చిన్నారులకు భగవద్గీత శ్లోక కంఠస్థ తరగతులు



భగద్గీత శ్లోకాలను పారాయణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని హరేరామ మందిరంలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు భగద్గీత శ్లోక కంఠస్థ తరగతులను ఆదివారం నిర్వహించారు. పరాత్మానంద సరస్వతీ స్వామీజీ చిన్నారులకు భగద్గీతలోని నాలుగో అధ్యాయమైన జ్ఞాన కర్మ, సన్యాసయోగంలోని శ్లోకాలను చిన్నారులచే పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత నేర్చుకోవడం ద్వారా మనిషి ఎలా జీవించాలో తెలుస్తుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయల విలువలను వివరించారు.

రిమ్స్‌లో అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్:ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు జన్మదినోత్సవం సందర్భంగా సహోద్యోగులు రిమ్స్‌లోని సత్యసాయి నిత్యఅన్నపూర్ణ పథకం ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు ఆదివారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో చౌదరి సతీష్, జగదీష్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం



నృత్యప్రదర్శన, శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలోని ఓం శాంతి త్రిలోక్ భవన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక, నృత్యప్రదర్శనలు చేశారు. అనంతరం శ్రీకృష్ణ తులాభారం చేశారు. శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలువురు ఓం శాంతి బ్రహ్మకుమారీలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని, ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ప్రతీ ఏడాది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గార, కొసమాల, వసుంధర తదితర గ్రామాల నుంచి 300 మంది హాజరవడం ఆనందదాయకమన్నారు.

ఈ కార్యక్రమంలో ఓంశాంతి బ్రహ్మకుమారీలు సుధారాణి, మోహిణి, వనజ, రాజ్యలక్ష్మి, పద్మ విజయ తదితరులు పాల్గొన్నారు.



ఇంజాద్రమ్మ తల్లికి చల్లదనం

వర్షాలు లేక పంట పొలాలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. కరుణించి వర్షాలు కురిపించాలని మెళియాపుట్టి మండలంలోని మర్రిపాడు-సి పంచాయతీ పరిధి జలకలింగుపురం గ్రామస్తులు మెళియాపుట్టి సమీపంలోని కొండపై నున్న ఇంజాద్రమ్మ గ్రామదేవతకు ముడ్రాటలు చెల్లించారు. గ్రామంలోని మహిళలు, రైతులంతా కలిసి ఆదివారం ఘటాలతో కొండపైకి వెళ్లి ఇంజాద్రమ్మ తల్లికి చల్లదనం చేశారు. గ్రామపెద్ద కొల్లి వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఏటా వర్షాలు పడాలని ఇంజాద్రమ్మ తల్లికి పూజించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇలా చేయడంతో వర్షాలు పడి పంటలు సుభిక్షంగా పండుతాయని విశ్వసిస్తామన్నారు. దుక్క బాలరాజు పాల్గొన్నారు. - మెళియాపుట్టి

బ్రిడ్జిపైనే వదిలేశారు..



కొత్తబ్రిడ్జిపై ఉన్న జనరేటర్

శ్రీకాకుళం నగర పరిధి దత్తాత్రేయ కోవెల కొత్త బ్రిడ్జిపై వారం రోజులుగా జనరేటర్‌ను ఎవరో వదిలేశారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. బ్రిడ్జిపైనే వదిలేసినా మున్సిపల్ యంత్రాంగం, ట్రాఫిక్ పోలీసులు దీన్ని పట్టించుకోవడం లేదు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా దీన్ని తక్షణమే తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు. - శ్రీకాకుళం రూరల్